సాక్షి
వికారాబాద్
ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



పత్తి రైతుల పరేషాన్

సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర తగ్గించడంతో రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



అవగాహన కల్పించి..

తాండూరు సబ్ డివిజన్ పరిధిలో హత్యలు, తగాదాలు, దొంగతనాలు ఈ ఏడాది బాగా తగ్గాయి. 8లో▸



ప్రజల చెంతకే పాలన

ప్రజాపాలన ద్వారా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

అక్రమ మైనింగ్ చేపడితే కేసులు

ఏడీ శామ్యూల్ జాకబ్



నాపరాతి తవ్వకాలను పరిశీలిస్తున్న ఏడీ

తాండూరు రూరల్: ప్రభుత్వ, పట్టా భూముల్లో అనుమతి లేకుండా మైనింగ్ చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మైనింగ్ ఏడీ శామ్యూల్ జాకబ్ హెచ్చరించారు. శనివారం ఆయన తన సిబ్బందితో కలిసి కరన్ కోట్‌లోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. తాండూరు పట్టణానికి చెందిన విజయలక్ష్మికి కరన్‌కోట్ గ్రామ శివారు సర్వే నంబర్ 2లో ఎకరా 25 గుంటల భూమి ఉందని, 25 సంవత్సరాల క్రితం తన మామా శరణప్పకు ప్రభుత్వం ఆ భూమిని కేటాయించిందని పేర్కొన్నారు. ఆ భూమిలో బసప్ప, సుధాకర్, అయ్యప్పలు అక్రమంగా మైనింగ్ చేపడుతున్నట్లు ప్రజావాణిలో కలెక్టర్‌కు బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆమె ఫిర్యాదు మేరకు ఇక్కడికి వచ్చామని, అక్రమంగా నాపరాతి తవ్వకాలు జరుపుతున్నట్లు గుర్తించి, నాలుగు నాపరాతి యంత్రాలను సీజ్ చేసినట్లు ఏడి తెలిపారు. అంతేకాకుండా విద్యుత్ సరఫరా నిలిపేశామని పేర్కొన్నారు. కొలతల ఆధారంగా ఫెనాల్టీ విధిస్తామన్నారు. సర్వే 2లోని ప్రభుత్వ భూమిని 2020లో మల్లికార్జున సొసైటీకి కేటాయించారని, విజయలక్ష్మికి ఎలాంటి సంబంధం లేదని సొసైటీ సభ్యులు ఏడీకి వివరించారు. పూర్తి వివరాలు సేకరించి కలెక్టర్‌కు నివేదిస్తామని ఏడీ చెప్పారు.

రాజీ పడితే.. విజయం మీదే

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్

అనంతగిరి: రాజీ పడితే ఇరువర్గాలు విజయం సాధించినట్లేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సుదర్శన్ అన్నారు. శనివారం వికారాబాద్ కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. కక్షిదారులు విశాల హృదయంతో ఆలోచిస్తే కేసుల నుంచి విముక్తి కలుగుతుందని పేర్కొన్నారు. తద్వారా డబ్బు, సమయం కలిసి వస్తుందని సూచించారు. ప్రతి వ్యక్తికి చట్టాలపై అవగాహన ఉండాలని, ఇందులో భాగంగా కళాశాల, పాఠశాలల్లో కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించబడ్డాయని, ప్రధానంగా ఈ-పిట్టీ, బీమా, డ్రంకెన్‌డ్రైవ్, ఎక్సైజ్, బ్యాంకులు, భూతగాదాలు తదితర కేసులు పరిష్కరించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎస్పీ కోటిరెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్, ప్రిన్సిపల్ జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు న్యాయమూర్తి శ్రుతిదూత, పీపీ రాజేశ్వర్, అన్వేషసింగ్, సమీనాబేగం, వికారాబాద్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శంకరయ్య, గోవర్ధన్‌రెడ్డి, సంపూర్ణ ఆనంద్, యాదవరెడ్డి, కమాల్‌రెడ్డి, బస్వరాజు, మాధవరెడ్డి, నాగరాజు, శ్రీనివాసరావు, జగన్, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

అర్హులకు ఆరు గ్యారంటీలు

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధి ఏడో వార్డు గుడిపల్లిలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలను అర్హులకు అందించేందుకు ప్రభుత్వం గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ప్రజాపాలన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోందని తెలిపారు. అర్జీలను జనవరి 6వరకు తీసుకోవడం జరుగుతుందని, అన్ని స్కీములకు ఒకటే దరఖాస్తు అని పేర్కొన్నారు. ఫారాలను తప్పులు లేకుండా, సక్రమంగా నింపాలని, పూరించడం రాని వారు, గ్రామ సభల వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ లను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సహకరించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ పథకం కింద పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. వికారాబాద్ మునిసిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, స్థానిక ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జోష్‌కు సిద్ధం



వికారాబాద్‌లో వేడుకలకు సిద్ధమైన రిసార్ట్

వికారాబాద్: కాల చక్రం గిర్రున తిరిగింది. అప్పుడే మరో ఏడాది కాలగర్భంలో కలిసి చరిత్రగా మారనుంది. 2023 ఏడాది నేటితో ముగియనుంది. గడిచిన సంవత్సర కాలంలో.. జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల, ఆయుష్ ఆస్పత్రి మంజూరు, ప్రారంభం మినహా.. చెప్పుకునేంతంగా ఏదీ లేకుండానే ముగిసి, కొత్త సంవత్సరం 2024 రానే వచ్చింది. ఈ నేపథ్యంలో గడిచిన కాలానికి వీడ్కోలు పలుకుతూనే.. కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు సకల జనులు రెడీ అయ్యారు. ముఖ్యంగా యువత. ఓ పక్క కరోనా కొత్త వేరియంట్ విజృంభిస్తుందనే భయాందోళనల మధ్య జోష్‌కు శ్రీకారం చుట్టారు. ఇందుకు అనుగుణంగా పూడూరు, వికారాబాద్, అనంతగిరి చుట్టు పక్కల గల రిసార్ట్స్ నిర్వాహకులు డిసెంబర్ 31 వేడుకల్లో యువతను ఉత్తేజపరిచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ట్రెండ్ మారుతోంది..

నూతన సంవత్సర వేడుకల్లో ట్రెండ్ మారింది. ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. గతంలో గ్రీటింగ్ కార్డులు, పోస్టు కార్డుల ద్వారా శుభాకాంక్షలు తెలుపుకొనే యువత.. నేడు సెల్‌ఫోన్లలో మెసేజ్‌లు పంపుతూ విషెష్ తెలుపుకొంటున్నారు. ప్రధానంగా నేటి రాత్రి 2023 ఏడాదికి ఘనంగా కేక్‌లతో వీడ్కోలు పలికేందుకు సిద్ధమవగా.. ఉత్సవాలకు అనుగుణంగా రకరకాల కేక్‌లు తయారు చేయడంలో బేకరీ నిర్వాహకులు నిమగ్నమయ్యారు. ప్రస్తుత కాలంలో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రతి ఇంట్లో చిన్నా, పెద్ద అని తేడా లేకుండా కేక్‌లు కట్‌చేయడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఇదిలా ఉండగా.. ఇదే రోజున మద్యం అమ్మకాలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఏడాది పొడవునా వీటి విక్రయం ఎలా ఉన్నా.. డిసెంబర్ 31న మాత్రం జోష్ బాగా ఉంటుందని మద్యం వ్యాపారులు పేర్కొనడం గమనార్హం.

నిఘా పటిష్టం..

గడిచిన కాలానికి వీడ్కోలు, కొత్త ఏడాదికి స్వాగత వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాలతో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకలు నిర్వహించుకునేందుకు ముందస్తు అనుమతి తీసుకోవాలని చెబుతూనే.. డీజేలు లాంటి ఆర్భాటం చేసే కార్యక్రమాలకు అనుమతి ఇవ్వబోమని తేల్చి చెప్పారు. రాత్రి 8 గంటల నుంచి జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లతో పాటుగా మండల కేంద్రాల్లోనూ గస్తీ చేపట్టనున్నారు. ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌లపై నిఘా పెంచారు. డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించనున్నారు.

న్యూ ఇయర్ వేడుకలకు సర్వం సన్నద్ధం

- బంధుమిత్రులతో జరుపుకొనేందుకు ఉత్సాహం
- దేవాలయాల సందర్శనకూ ప్రణాళిక
- రిసార్ట్స్‌లో ప్రత్యేక ఏర్పాట్లు
- స్పెషల్ బృందాలతో పోలీసుల గస్తీ

“మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు



కరోనా మళ్లీ విజృంభిస్తున్న నేపథ్యంలో నూతన సంవత్సర వేడుకల్లో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా యువత. కట్టుదిట్టమైన ఆంక్షలేమీ లేనప్పటికీ.. ఆర్భాటాలకు దూరంగా ఉండటం మంచిది. ఉత్సవాల పేరిట ఇతరులకు అసౌకర్యం కలిగించొద్దు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించం. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటాం. నిఘా పెంచాం. పోలీసులు కూడా మీలో ఒకరే. సంతోషాన్ని త్యాగం చేసి, మీ కోసం పనిచేస్తున్నారన్న విషయం గుర్తుంచుకోవాలి. అందరూ సహకరించాలి.

– కోటిరెడ్డి, ఎస్పీ, వికారాబాద్

పేదల సంక్షేమానికే ‘ప్రజాపాలన’

- ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- హాజరైన ప్రజాప్రతినిధులు, స్పెషల్ ఆఫీసర్లు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో కలెక్టర్లు నారాయణరెడ్డి, గౌతమ్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం సమావేశ మందిరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజాపాలన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. నిరుపేదల సమస్యలను పరిష్కరించి.. వారి సంక్షేమం కోసమే ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించామని తెలిపారు. తమ ప్రభుత్వం దళారుల ప్రమేయం లేకుండా పారదర్శక పాలన అందిస్తుందన్నారు. అభయ హస్తం పథకాల దరఖాస్తులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సంబంధిత ప్రత్యేక అధికారులను ఆదేశించారు. దరఖాస్తులు ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందని.. జిరాక్స్ కేంద్రాల వారికి అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా దరఖాస్తులు విక్రయిస్తే వారిపైన చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. వృద్ధులకు, దివ్యాంగులకు, మహిళలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అర్జీలను స్వీకరించాలని సూచించారు. ఆరు గ్యారంటీలను వీలైనంత త్వరగా అమలు చేసేందుకు ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే రెండు గ్యారంటీలను అమలు చేశామని.. ఉచిత బస్సు ప్రయాణంతో పనిచేసే మహిళా కుటుంబానికి నెలకు రూ.3వేల వరకు ఆదా అవుతోందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సేవల పరిమితి రూ.10లక్షలకు పెంచడంతో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వివరించారు.

రేషన్ కార్డుకు దరఖాస్తు రాయించుకోండి

రేషన్ కార్డుల కోసం, రెవెన్యూ సంబంధిత సమస్యలు తదితరాలపై దరఖాస్తు చేసుకునే వారి కోసం తెల్ల కాగితంపై దరఖాస్తును రాయించుకుని, వారికి రసీదు అందజేయాలని మంత్రి సూచించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని శాసన సభ్యులతో, స్పెషల్ ఆఫీసర్లతో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించే సమయంలో ఎదుర్కొనే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న అధికారులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ అనిత, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, మేడ్చల్ జడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాశ్ గౌడ్, సుధీర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, బుయ్యని మనోహర్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు, వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, అభిషేక్, సైబరాబాద్ డీసీపీ నారాయణ, మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఆర్డీఓలు, స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



బోటింగ్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

రూ.3వేల కోట్లతో అభివృద్ధి చేస్తా!

- కోట్‌పల్లికి ఎన్ని నిధులైనా తెస్తా
- ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- యువతకు ఉపాధి చూపుతాం
- శాసనసభ స్పీకర్ జి. ప్రసాద్‌కుమార్

ధారూరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో రూ.3వేల కోట్ల వరకు నిధులు తెచ్చి, జిల్లాను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం ధారూరు మండలం కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద బోటింగ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. ఎన్ని నిధులైనా తెచ్చి ప్రాజెక్టును అభివృద్ధి చేస్తానని తెలిపారు. దివంగత నేత వైఎస్సార్ హయాంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సృజల స్రవంతి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేవెళ్లకు తీసుకువచ్చారని, మాజీమంత్రి సబిత, రాంమోహన్‌రెడ్డి, నేను కలిసి ప్రాజెక్టు పరిధిని తాండూరు, పరిగి, వికారాబాద్ వరకు విస్తరించేలా చేశామన్నారు.

నీటిని అడ్డుకున్న బీఆర్‌ఎస్

ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా శంకర్‌పల్లిలో రూ.1,300 కోట్లతో పని జరిగిందని స్పీకర్ ప్రసాద్ కుమార్ తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సర్వే చేయించడానికి రూ.7 కోట్లు తీసుకువచ్చామన్నారు. జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో మహ్మదాబాద్ వరకు నీటిని తీసుకువచ్చి, అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా అంతటికీ విస్తరించాలని భావించామని సభాపతి పేర్కొన్నారు. రెండు ప్రాజెక్టుల నీరు జిల్లాకు రాకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుట్ర చేసిందని ఆయన ఆరోపించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా జిల్లాకు నీటిని రప్పించడానికి సీఎంతో చర్చిస్తామని పేర్కొన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో కోట్‌పల్లికి రూ.20 కోట్ల నిధులు మంజూరుచేసి పనులు చేయించామని, తర్వాత బీఆర్‌ఎస్ పట్టించుకోలేదని విమర్శించారు. ప్రాజెక్టుకు ఏం చేస్తే పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందుతుందో, ఆ విధంగా రిపోర్టు తయారు చేయాలని ఇరిగేషన్ ఈఈ సుందర్‌ను ఆయన ఆదేశించారు.

అనంతకు రూ.200 కోట్లు

అనంతగిరిగుట్ట అభివృద్ధి కోసం నాడు మంత్రిగా ఉన్నప్పుడు రూ.220 కోట్లు తీసుకువస్తే.. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి మూలన పడేసిందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ విమర్శించారు. ఈకో టూరిజంలో భాగంగా రూ.200 కోట్లు తీసుకువచ్చి అభివృద్ధి చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఉపాధి కల్పనకు ప్రాధాన్యత


బోటింగ్ ద్వారా యువత, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని స్పీకర్ వెల్లడించారు. జిల్లా ప్రాజెక్టును టూరిజం హబ్‌లుగా మారుద్దామన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 50 లక్షల వరకు నిరుద్యోగులు ఉన్నారని, కేవలం 2 లక్షల ఉద్యోగాలు మాత్రమే ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. సర్కారు కొలువులు రానివారికి సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ కింద ఉపాధి కల్పిస్తే, వారంతా లబ్ధిపొందుతారన్నారు.

అందరికి లబ్ధిచేకూరేలా..

కోట్‌పల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్న వారిని చేపల సంఘంలో చేర్చి, అందరికి లబ్ధిచేకూరేలా చూడాలని మత్స్యశాఖ జిల్లా అధికారి చరితారెడ్డికి స్పీకర్ సూచించారు. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, బంటారం జెడ్పీటీసీ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, ఆర్డీఓ విజయకుమారీ, డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, ఇరిగేషన్ ఈఈ సుందర్, ఏఈ నవీన్ తదితరులు ఉన్నారు.

కొడంగల్ అభివృద్ధికి శ్రీకారం

- కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ (కడా)ఏర్పాటు
- కడా చైర్మన్‌గా వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి
- ప్రత్యేకాధికారిగా నాగర్‌కర్నూల్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి





కడా చైర్మన్ కలెక్టర్ నారాయణరెడ్డి



కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. నియోజకవర్గం అయిన కొడంగల్ అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ (కడా) ఏర్పాటు చేస్తూ జీఓ నంబర్ 14ను ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం విడుదల చేశారు. కడా ప్రత్యేకాధికారిగా నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్డీఓ వెంకట్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఆయనకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించి, కడ ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఆదేశాలు జారీ చేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో కడా పనిచేయనుంది. ఇందులో ఆరుగురు సభ్యులు ఉంటారు.

త్వరలో కమిటీ..

కొడంగల్ నియోజకవర్గ పరిధి 8 మండలాలకు చెందిన నియోజకవర్గ స్థాయి అధికారులను సభ్యులుగా నియమిస్తారు. త్వరలో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు అధికార వర్గాల సమాచారం. వీరు నియోజకవర్గ పరిస్థితులను అంచనా వేస్తారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నివేదికలు సిద్ధం చేస్తారు. సమగ్ర అభివృద్ధికి చేపట్టాల్సిన పనుల గురించి స్థానికులతో కలిసి చర్చించి, ప్రతిపాదనలు తయారు చేస్తారు. ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గం వికారాబాద్, నారాయణపేట జిల్లాల పరిధిలో ఉంది. వికారాబాద్‌లో నాలుగు మండలాలు, నారాయణపేటలో నాలుగు మండలాలు ఉన్నాయి. ఈ రెండు జిల్లాలను సమన్వయం చేయాల్సిన బాధ్యత ఆయా జిల్లాల కలెక్టర్లపై ఉంచారు.

మౌలిక సదుపాయాల కల్పనకు..

భవిష్యత్తులో కొడంగల్ నియోజకవర్గం మొత్తాన్ని ఏకం చేసి, ఒకే జిల్లాలో ఉంచే అవకాశం ఉంది. అప్పటి వరకు రెండు జిల్లాల ఉన్నతాధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. సీసీరోడ్లు, మురుగు కాల్వలు, నీటి సరఫరా పథకాలు, విద్యుదీకరణ, వీధి దీపాల ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఉత్పాదకతను పెంచడానికి.. వినూత్నమైన జీవనోపాధి కార్యక్రమాలను చేపట్టడానికి.. నైపుణ్యాన్ని పెంచి ఉపాధి కల్పించడానికి కడా ప్రయత్నిస్తుంది. క్రీడా కార్యకలాపాలకు శిక్షణ, విద్యా వైద్యం ఆరోగ్యం వంటి సామాజిక అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. యాంత్రీకరణ పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నారు. మొత్తంగా సమీప భవిష్యత్తులో కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని స్థానికులు భావిస్తున్నారు.

రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయాలి: ఎంపీపీ

సాగునీటి వనరులపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. నియోజకవర్గ రైతులు చెరువులపై ఆధారపడి సాగు చేస్తున్నారని చెప్పారు. జీఓ నంబర్ 69 అమలు చేయాలని కోరారు. కొడంగల్ ఆసుపత్రిని 100 పడకల స్థాయికి పెంచాలని, నూతనంగా పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలన్నారు. రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణీ, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, కౌన్సిలర్ రమేష్, కోఆప్షన్ మునీర్, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి, మురహరి వశిష్ఠ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి

కొత్త సంవత్సరం కానుకగా

కొడంగల్ అభివృద్ధి కోసం కడాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేశారని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లోనూ కొడంగల్‌ను అభివృద్ధి చేయడానికి సీఎం సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ మేరకు అధిక మొత్తంలో నిధులు వస్తాయన్నారు. నూతన సంవత్సర కానుకగా ముఖ్యమంత్రి కడాను కొడంగల్ ప్రజలకు ఇచ్చారని కొనియాడారు.



గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద క్యూలో మహిళలు

అప్‌డేట్ ఆందోళన

ఈకేవైసీ కోసం బారులు తీరిన జనం

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలకు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు తప్పనిసరి కావడంతో దరఖాస్తు దారుల్లో ఆందోళన నెలకొంది. దీంతో రేషన్‌కార్డు, ఆధార్ లేని వారు, ఉన్న వాటిల్లో అప్‌డేట్ కోసం అవసరమైన వారు ఆధార్, మీ సేవా కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. ఈకేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల వద్దకూ పరుగు తీస్తున్నారు. నాలుగు రోజులుగా ప్రజలు పెద్ద ఎత్తున ఉదయం 6గంటల నుంచే ఆయా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నా.. ఆయా సెంటర్లు ఉదయం 10గంటల తరువాతే తెరచుకోవడటంతో మహిళలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. అపసోపాలు పడుతూ.. చాంతాడంత పొడవున్న లైన్‌ల్లో నిలబడి తమవంతుకోసం ఎదురు చూస్తున్నారు.

క్లుప్తంగా

గ్యారంటీల అమలుకు దరఖాస్తులు

జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి



తుమ్మలపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి

మర్పల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకే ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తుందని జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో 3వ రోజు అభయహస్తం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరై ఆయన మాట్లాడారు. గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకునే వారు పత్రాన్ని పూర్తిగా నింపాలన్నారు. స్థానికంగా లేని వారు ఉంటే గ్రామసభలో దరఖాస్తు చేయకున్న వచ్చే నెల 6వ తేదీ వరకు పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అనిత, ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య, ఏఈ శ్రావణ్‌కుమార్, ఏపీఓ అంజిరెడ్డి, ఈసీ విఠల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా మహిపాల్

అనంతగిరి: సీపీఎం జిల్లా కార్యదర్శిగా మహిపాల్ ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధినాయకత్వం తమ్మినేని వీరభద్రం, జాన్‌వెస్లీ, వెంకట్రాములు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ పార్టీ అభ్యున్నతికి పాటుపడుతానన్నారు. కోర్ కమిటీగా రామకృష్ణ, వెంకటయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, శ్రీనివాస్, బుగ్గప్ప, సుభాష్, సుదర్శన్, సత్యనారాయణ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

షాబాద్: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన సంఘటన షాబాద్ మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో చోటు చేసుకుంది. షాబాద్ ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధీమ్ కృష్ణయ్య(50) శనివారం తన వ్యవసాయ పొలం వద్ద బోరు నడవకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసేందుకు వెళ్లగా అక్కడ కింద తెగిపడిన విద్యుత్ వైరును గమనించకపోవడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

షాద్‌నగర్‌రూరల్: కుటుంబ కలహాలతో బావిలో దూకి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో శనివారం వెలుగుచూసింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీనివాస్(35), రవి అన్నదమ్ముళ్లు. వీరు శుక్రవారం కుటుంబ విషయాలపై ఘర్షణ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన శ్రీనివాస్ గ్రామ సమీపంలోని బావిలో దూకాడు. దీంతో మృతదేహం శనివారం ఉదయం నీటిపై తేలడంతో బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ బలవన్మరణానికి మద్యం మత్తు కారణమని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాంచందర్ తెలిపారు.

పత్తి రైతుల పరేషాన్

సీసీఐ నిర్ణయంతో తెల్ల బంగారం పండించే రైతన్నల ముఖం వాడిపోయింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు సరైన మద్దతు ధర కేటాయించక పోగా ఉన్న దానిలో రూ.100 కోత విధించడంతో లబోదిబోమంటున్నారు. ఏడాది పాటు చేసిన కష్టానికి సరైన ప్రతిఫలం దక్కలేదని వాపోతున్నారు.

- సీసీఐ మద్దతు ధరలో రూ.100 తగ్గింపు
- ఆందోళనలో అన్నదాతలు



రోడ్లపై బారులు తీరిన వాహనాలు



మిల్లులకు పెద్ద ఎత్తున వచ్చిన పత్తి

పెద్దేముల్: సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర తగ్గించడంతో రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిన ధర గిట్టుబాటు కావడం లేదని ఓ వైపు రోదిస్తుంటే..మరోవైపు కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ.100 తగ్గించడంతో అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గతేడాది రూ.9,500 నుంచి రూ.10 వేలు పలికిన పత్తి ధర ఈ ఏడాది క్వింటాకు రూ.3 వేలు తగ్గడం , అంతేలోనే రూ.100 అకస్మాత్తుగా తగ్గించడంతో రైతులు బోరున విలపిస్తున్నారు. ఏడాది పాటు చేసిన కష్టం బుగ్గిపాలు అవుతుందని వాపోతున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది క్వింటాకు రూ.7,020 ధర నిర్ధారించగా దానిని రూ.6,920కి తగ్గించడంతో శనివారం రైతులు ట్రాక్టర్, ఆటోల్ల ద్వారా పత్తిని తీసుకొని ఉదయం నుంచే మిల్లులకు బారులు తీరారు.

20 వేల క్వింటాళ్లకు పైగా కొనుగోలు

పెద్దేముల్ మండలంలో ఉన్న సుమిత్ర, సాయిబాబా కాటన్ మిల్లుల ద్వారా సుమారు 1,100 మంది రైతుల నుంచి దాదాపు 20 వేల క్వింటాళ్లకు పైగా పత్తి కొనుగోలు జరిగాయి. గత మూడేళ్ల నుంచి భారీ వర్షాలకు పంటలు పాడైయ్యాయి. ఈ సీజన్‌లో అయినా పంటలకు గిట్టుబాటు ధర దక్కుతుందని అనుకుంటే సీసీఐ నిర్ణయంతో రైతులకు ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వాలు మారిన.. నాయకులు మారిన తమ బతుకులు మారడం లేదని దిగ్భ్రాంత్రి చెందుతున్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా తయారైందని రైతులు వాపోతున్నారు. రోజురోజుకు పెట్టుబడులు రెండింతలు పెరుగుతున్నాయి. విత్తనాలు, క్రిమి సంహారక మందుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కానీ అన్నదాతలు పండించిన పంటలకు మాత్రం మద్దతు ధర దక్కకపోవడం ఏమిటని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం పెరిగిన పెట్టుబడులకు, మందుల ధరలకు పత్తి క్వింటాళ్లకు రూ.10 వేల నుంచి రూ.11వేలు పలికిన తక్కువనే అని రైతులు అంటున్నారు. అన్నం పెట్టే రైతును ఇబ్బంది పెడుతున్న కేంద్ర ప్రభుత్వంపై పలు గ్రామాల అన్నదాతలు మండి పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కర్షకులు కోరుతున్నారు.

పక్కాగా హామీల అమలు

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేస్తుందని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభకు హాజరై 61 మంది కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన అభయహస్తం ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామన్నారు. ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేశామని మిగతా వాటి కోసం గ్రామాలలో ప్రజాపాలన సభలను ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. దరఖాస్తు ఫారాలను కొనుగోలు చేయవద్దని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రతి ఇంటికి అందేలా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటు పడిందని, పాలన వ్యవస్థ అస్తవ్యస్తంగా మార్చారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టరు లింగ్యానాయక్, ఆర్డీఓ విజయకుమారి, మండల ప్రత్యేకాధికారి చరితారెడ్డి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీపీ వసంత, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శంకర్, మహేందర్ రెడ్డి, వేమారెడ్డి, మహంత్‌స్వామి, బాబు, చంద్రయ్య, బాగ్దాద్, సిరాజోద్దీన్, ఎజాస్‌పటేల్, మాణయ్య ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

బంట్వారం: గుండెపోటుతో కోట్‌పల్లి మండలంలోని కరీంపూర్ పంచాయతీ కార్యదర్శి ఎ.సుభాష్(45) మృతి చెందారు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున నగరంలోని ఓల్డు బోయినపల్లి ఆయన నివాసంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ ఓల్డు బోయినపల్లికి చెందిన సుభాష్ గత ఏడేళ్లుగా కరీంపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ నుంచే రైలులో రాకపోకలు సాగించేవారు. శుక్రవారం నగరంలోనే ఓ విందుకు హాజరై రాత్రి ఇంటికి వెళ్లిన సుభాష్ నిద్రకు ఉపక్రమించారు. శనివారం తెల్లవారుజామున అల్లారం ఎంత మోగిన ఆయన నిద్ర లేవలేదు. మరో గదిలో ఉన్న కుటుంబీకులు చూడగా నిద్రలోనే గుండెపోటుతో చనిపోయినట్లు గుర్తించారు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కు మరణంతో భార్య అనిత, ఇద్దరు పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. పంచాయతీ కార్యదర్శి మృతిపై సర్పంచ్ సుందరిఅనిల్ సంతాపం ప్రకటించి సానుభూతి వ్యక్తం చేశారు.



సుభాష్ (ఫైల్)

భర్తను బంధించిన భార్య

- మరో మహిళతో పారిపోతుండగా అడ్డుకున్న వైనం
- తాళ్లతో కట్టేసి పోలీసులకు అప్పజెప్పిన కుటుంబసభ్యులు



తాళ్లతో బంధించి ఉన్న రామ్‌కుమార్

పరిగి: భర్త వేరే మహిళతో పారిపోతుండగా భార్య పట్టుకుని తాళ్లతో బంధించిన సంఘటన పట్టణ కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రాపోల్ గ్రామానికి చెందిన రామ్‌కుమార్‌కు నాలుగేళ్ల క్రితం రజితతో వివాహం జరగగా.. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. గత ఏడాది నుంచి రామ్‌కుమార్ భార్యతో కాపురం చేయకుండా వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పట్టణ కేంద్రంలోని తుంకుల్‌గడ్డలో సదరు మహిళతో తన భర్త ఉన్నాడని తెలియడంతో పోలీసు సమక్షంలో భార్య రెడ్‌హ్యాండ్‌గా పట్టుకుంది. రాత్రి కావడంతో పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి ఉదయం రావాలని చెప్పారు. ఇంటి నుంచి ఉదయం చెప్పకుండా రామ్‌కుమార్ వెళ్లిపోయాడు. దీంతో రజిత తన అన్నదమ్ములతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు పరిగికి వెళ్తుండగా పట్టణ కేంద్రంలోని బహార్‌పేట్‌లో సదరు మహిళతో బైక్‌పై రాంకుమార్ కనిపించాడు. అతన్ని అడ్డుకొని తాళ్లతో కట్టి పోలీసులకు అప్పజెప్పారు. తనకు న్యాయం చేయాలని పోలీసులను బాధితురాలు కోరింది. ఇరువురికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.

ఎండిన ‘హరితహారం’

- లక్షల రూపాయల నిధులు మట్టి పాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



ఖాళీగా కుండీలు

వికారాబాద్ అర్బన్: హరితహార కార్యక్రమం కొందరి అధికారులకు వరంగా మారింది. ఇబ్బడిముబ్బడిగా మొక్కలు నాటినట్లు లెక్కలు చూపి డబ్బులు దండుకున్న అధికారులు ఆ తరువాత నిర్వహణ గాలికొదిలేశారు. గత ఏడాది ఫిబ్రవరిలో పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంబడి డివైడర్ పైన కుండీలు ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. ఒక్కో కుండీకి రూ.300 నుంచి రూ.500 వరకు వెచ్చించారు. వాటిలో నాటే మొక్కకు రూ.300 వరకు ఖర్చు చేశారు. అందుకు రూ.5 లక్షలు వెచ్చించారు. ఇంత వరకు బాగానే ఉన్నా ప్రస్తుతం అక్కడ మొక్కలు లేవు. ఖాళీ కుండీలే దర్శనమిస్తున్నాయి. ఏడాది గడవక ముందే కుండీలు పగిలి, మొక్కలు ఎండిపోయాయి. బీజేఆర్ చౌరస్తా నుంచి ఆలంపల్లి చౌరస్తా వరకు ఉన్న ప్రధాన రోడ్డులో ఒక్క మొక్కల లేకపోవడం పట్టణ ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది.

కల్పతరువుగా గ్రీన్ బడ్జెట్

గ్రీన్ బడ్జెట్ మున్సిపల్ అధికారులకు కల్పతరువుగా మారింది. హరితహారం పేరుతో ఇష్టం వచ్చినట్లు బడ్జెట్‌ను గీకేస్తున్నారు. లక్షలు ఖర్చు చేసి మొక్కలు నాటుతున్నా సరైన పర్యవేక్షణ లేక ఎండిపోతున్నాయి. గతంలో ఇదే డివైడర్‌పై పనిచేసిన మున్సిపల్ అధికారులు లక్షల రూపాయలు ఖర్చు చేసి మొక్కలు నాటారు. ఏడాదిలోనే ఆ మొక్కలు ఎండిపోవడం, తర్వాత వచ్చిన అధికారులు అదే చోట మొక్కలు నాటి డబ్బులు డ్రా చేయడం పరిపాటిగా మారింది. మున్సిపల్ అధికారులు కేవలం డబ్బులు కాజేయడం పైనే దృష్టి పెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. బీజేఆర్ చౌరస్తా నుంచి ఆలంపల్లి చౌరస్తా వరకు 500 మొక్కలు నాటితే ప్రస్తుతం ఒక్క మొక్క లేకపోవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రస్తుతం ఉన్న అధికారులు మరిన్ని డబ్బులు ఖర్చుపెట్టి అదే చోట కొత్త మొక్కలను నాటేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

అవగాహన కల్పించి.. నేరాలు తగ్గించి

కాలచక్రం గిర్రున తిరిగింది. మరో ఏడాది కాలగర్భంలో కలిసిపోతోంది. 2023 ముగింపునకు మరికొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ ఏడాది తాండూరు సబ్ డివిజన్ పరిధిలో జరిగిన నేరాలను ఒక్కసారి పరిశీలిస్తే క్రైమ్ రేటు చాలా వరకు తగ్గింది. మూడేళ్ల క్రితం వరకు ఉన్న క్రైమ్ రేటు పోల్చితే ఏటా తగ్గుతూ రావడం పోలీసుల పనితీరుకు నిదర్శనంగా భావిస్తున్నారు. చోరీలు, డ్రంకెన్‌డ్రైవ్‌లు, పెట్రోలింగ్‌పై చూపిన ప్రత్యేక శ్రద్ధ సత్ఫలితాలనిచ్చింది.

- ఇసుక, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- డ్రంకెన్ డ్రైవ్‌తో రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట
- తాండూరు సబ్ డివిజన్‌లో తగ్గిన క్రైమ్ రేటు



అడవిలో మహిళ శవం కోసం వెతుకుతున్న పోలీసులు (ఫైల్)

తాండూరు: తాండూరు సబ్ డివిజన్ పరిధిలో హత్యలు, తగాదాలు, దొంగతనాలు ఈ ఏడాది బాగా తగ్గాయి. 2023 డిసెంబర్ వరకు తాండూరు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్‌తో పాటు పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 1,025 కేసులు రిజిస్టర్ అయ్యాయి. వాటిలో నాన్ బెయిలెబుల్ 544 కేసులు నమోదయ్యాయి. సబ్ డివిజన్ పరిధిలోని కరన్‌కోట్ ఠాణా పరిధిలో 247 కేసులు, పెద్దేముల్‌లో 163 కేసులు, బషీరాబాద్‌లో 162, యాలాలలో 194 కేసులు, తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో 259 కేసులు నమోదయ్యాయి. మరో వైపు ఇసుక అక్రమరవాణా, గంజాయి రవాణాపై పోలీసులు స్పెషల్ ఫోకస్‌తో నియంత్రించారు.

ఒక్కరోజులోనే ఛేదించిన పోలీసులు

తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైల్వే బ్రిడ్జ్ సమీపంలో నివాసం ఉంటున్న ఆర్టీఓ కన్సల్టెంట్ అస్గారి వాజిద్ గత జులై నెలలో కందనెల్లి సమీపంలో ఉన్న తన ప్లాట్‌ను అమ్మగా వచ్చిన రూ.20 లక్షలను ఇంట్లోనే దాచుకున్నారు. బంధువుల పెళ్లి నిమిత్తం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. మరుసటి రోజు ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగల గొట్టి ఉన్నాయి. ఈ విషయం గమనించిన వాజిద్ దాచుకున్న డబ్బులను చూడగా కనిపించలేదు. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ రాజేందర్‌రెడ్డి ఫిర్యాదు అందుకున్న వెంటనే తన టీంను రంగంలోకి దింపారు. నిష్ణాతులైన పోలీసు బృందం 24 గంటల వ్యవధిలోనే చోరీ కేసును ఛేదించి ఐదుగురిని పట్టుకొని రూ.20 లక్షల నగదును రికవరీ చేశారు. అనంతరం వారిని జైలుకు పంపించారు.

కటకటాల్లో సైకో

మహిళలను టార్గెట్‌గా చేసుకొని వరుస హత్యలకు పాల్పడుతున్న సైకో కిల్లర్ ఆటకట్టించి కటకటాల్లోకి పంపించారు. ధారురు మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన మాల కిష్టప్ప అడ్డా కూలీలుగా ఉన్న మహిళలను హత్య చేస్తు సైకో కిల్లర్‌గా మారాడు. అదే తరహాలోనే ఈ నెలలో కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ జిల్లాకు చెందిన సర్వాబి(42) తన భర్త మహ్మద్‌తో కలిసి తాండూరులో నివసిస్తోంది. ఈ నెల 1న తన భార్య సర్వాబి కనిపించడం లేదంటూ భర్త పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. కెమెరాలో కనిపించిన వ్యక్తి సైకో కిల్లర్ మాల కిష్టప్పగా గుర్తించారు. దీంతో పోలీసులు కిష్టప్పను అదుపులోకి తీసుకొని విచారించి సర్వాబిని నగదు, నగల కోసమే అడవికి తీసుకెళ్లి హత్య చేసినట్లు అంగీకరించాడు. దీంతో ఒక్క రోజు వ్యవధిలోనే కేసును ఛేదించిన పోలీసులకు జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి రివార్డు అందించి అభినందించారు.

ఏడాదికే జీవితఖైదు

తాండూరు రూరల్ సర్కిల్ పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాషాపూర్ తండాకు చెందిన మంగ్లీబాయి(50)ని అదే తండాకు చెందిన రాథోడ్ విలాస్ అనే యువకుడు రూ.50 అడిగాడు. తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో మంగ్లీబాయిని అక్కడే చంపేసి వెళ్లిపోయాడు. మృతురాలు కుమారుడు గోపాల్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొన్నారు. కేసు నమోదు చేసిన ఏడాదికే నిందితుడు విలాస్‌ను కోర్టులో న్యాయమూర్తి జీవితఖైదుతో పాటు రూ.1,000 జరిమానా విధించారు.

6 హత్యలు, 15 అత్యాచారాలు

సబ్ డివిజన్ పరిధిలో 6 హత్యలు, పగటి పూట చోరీ1, రాత్రి చోరీలు 19, చిన్న దొంగతనాలు 26, ఆత్మహత్యలు 2, కిడ్నాప్‌లు 11, మానభంగాలు 15, చీటింగ్ కేసులు 39, హత్యయత్నాలు 6, మిస్సింగ్ కేసులు 70తో పాటు పలు రకాల నేరాలు ఈ ఏడాది నమోదయ్యాయి. అయితే చోరీ కేసుల్లో ఈ ఏడాది రూ.59.91 లక్షల నగదు చోరీ జరిగితే పోలీసులు రూ.45.16 లక్షల నగదును రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికలలో నగదును సీజ్ చేసి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంలో పోలీసులు కీలకంగా వ్యవహరించారు.

ప్రజలతో మమేకం



గ్రామాలలో ప్రజలతో మమేకమవుతున్నాం. నేరాల నియంత్రణ కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తు చైతన్య పరుస్తున్నాం. చిన్నపాటి తగాదాలకు గొడవలు పడటం ఇటీవలి కాలంలో తగ్గింది. భూ తగాదాలు జరగకుండా చర్యలు చేపట్టాం. నేరం చేసిన వారు ఎంతటి వారైన శిక్షార్హులేనని ప్రజలకు అవగహన కల్పిస్తున్నాం. శాంతి భద్రత పరిరక్షణలో సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయం.

– శేఖర్‌గౌడ్, డీఎస్పీ తాండూరు

ప్రభుత్వ నిర్ణయం సంతోషకరం

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్

మొయినాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం హర్షనీయమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరి రమేష్, ఉద్యమనేత కేబుల్ రాజు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేసిన వారిని గుర్తించి 250 గజాల ఇంటి స్థలం ఇవ్వడానికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పిన ప్రభుత్వ నిర్ణయం సంతోషకరమన్నారు. ఉద్యమంలో ఎన్నో కేసులు ఎదుర్కొని ఇబ్బందులకు గురయ్యామన్నారు. ఇప్పడు ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి ఇళ్ల స్థలాలు ఇస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నా రు. సమావేశంలో మహిపాల్, జగన్, అవినాష్, ముకుందరెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యమకారులు

దేవాలయ భూమి సర్వేపూర్తి

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని శ్రీరామచంద్రజీ దేవాలయం భూమి కబ్జా సర్వే పూర్తయింది. సర్వేనంబరు 668లో శ్రీ రామచంద్రజీ దేవాలయం భూమి మొత్తం7.18 ఎకరాల భూమి ఉంది. దేవాలయం ఉన్న ఈ భూమిలో ఇరువైపులా అక్రమార్కులు కబ్జా కు పాల్పడ్డారు. గతంలో రెండు సర్వేలు పూర్తి చేయించిన దేవాదాయ శాఖ అధికారులు తాజాగా శనివారం ఈవో మోహన్ రావు ఆధ్వర్యంలో ఏడీ సర్వే చేయించారు. ఆలయానికి ఇరువైపులా, వెనక భాగంలో కబ్జాకు గురికావడంతో రెవెన్యూ సర్వేతో పాటు ఏడీ సర్వే చేయించినట్లు ఈవో మోహన్‌రావు తెలిపారు. గగన్‌పహాడ్ పరిధిలో ఉన్న ఆలయ భూములపై కూ డా కోర్టుతో పాటు ట్రిబ్యునల్‌లో కేసు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారం రోజుల్లో వాస్తవ నివేదిక అందనున్నటు అధికారులు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

ముగ్గురు నిందితుల రిమాండ్

రాజేంద్రనగర్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను శంషాబాద్ డీటీఎఫ్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి బైక్, రెండు సెల్‌ఫోన్లు, 2 కిలోల 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఉప్పర్‌పల్లిలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (డీటీఎఫ్) శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, దేవేందర్ రావు వివరాలను వెల్లడించారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఆజం పటేల్, బిహార్‌కు చెందిన అనిల్‌కుమార్, హర్యానాకు చెందిన ఖలీల్ బతుకు దెరువు నిమిత్తం కాటేదాన్ ప్రాంతానికి వలసవచ్చి ఓఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో గంజాయి విక్రయించాలని పథకం వేశారు. ఇందులో భాగంగా ఆజం పటేల్, అనిల్ కుమార్, ఖలీల్ బైక్‌పై నగరు శివారు నుంచి ఓ వ్యక్తి వద్ద నుంచి 2. 700 గ్రాముల ఎండు గంజాయిని కొనుగోలు చేసి. శనివారం ఉదయం గగన్‌పహాడ్ మీదుగా కాటేదాన్ తీసుకొస్తుండగా రూట్ వాచ్‌లో భాగంగా డీటీఎఫ్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై శ్రీకాంత్ తన బృందంతో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. బ్యాగ్‌లో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ఎక్కడైనా గంజాయిని విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందించాలన్నారు.

హైదరాబాద్ జేటీసీగా రమేశ్

- పరిపాలన విభాగానికి పాండురంగ్ నాయక్ బదిలీ
- చెక్ పోస్టు ఓడీలను రద్దు చేసిన సర్కార్
- రవాణాశాఖలో సమూల ప్రక్షాళన
- త్వరలో పూర్తిస్థాయి బదిలీలకు సన్నాహాలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా సి.రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం హైదరాబాద్ జేటీసీగా ఉన్న పాండురంగ్‌నాయక్ రవాణా కమిషనర్ కార్యాలయంలోని పరిపాలన విభాగం జేటీసీగా బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఐటీ బాధ్యతలను పర్యవేక్షించిన రమేష్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. మరోవైపు పరిపాలన విభాగం బాధ్యతలను పర్యవేక్షించిన జేటీసీ మమతా ప్రసాద్‌ను ఐటీ విభాగానికి బదిలీ చేశారు. రవాణా శాఖలో కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు కొంతకాలంగా బదిలీలు, పదోన్నతులను నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీంతో కొత్తగా బాధ్యతలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రవాణాశాఖపై సీరియస్‌గా దృష్టి సారించింది.గతంలో చోటుచేసుకున్న అక్రమాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్నతస్థాయిలో బదిలీలు చేపట్టారు.త్వరలో అన్ని విభాగాల్లోనూ బదిలీలతోపాటు, సమూల ప్రక్షాళన చేయనున్నట్లు సమాచారం. కొందరు అధికారులు, ఉద్యోగులు ఏళ్లతరబడి ఒకేచోట పని చేస్తుండడంతో అక్రమాలు చోటుచేసుకుంటున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యంగా దళారులు, ఏజెంట్ల కార్యకలాపాలు వ్యవస్థీకృతంగా మారాయి. వాహనదారులకు అందజేసే వివిధ రకాల పౌరసేవల్లో పారదర్శకత లోపించింది. మరోవైపు రహదారి భద్రత వంటి కీలకమైన విధులను కూడా కొందరు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ క్రమంలో సమూల మార్పులను చేపట్టినట్లు రవాణాశాఖ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.

ఓడీలు ఔట్...

ఆన్‌డెప్యుటేషన్ (ఓడీ)లపై వెళ్లి చెక్‌పోస్టుల్లో పని చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల ఓడీలను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు వారు తమ సొంత ప్రాంతీయ రవాణా కార్యాలయాలు, డ్రైవింగ్ టెస్ట్ కేంద్రాలు, ఎంవీఐ యూనిట్‌లలోనే విధులు నిర్వహించవలసి ఉంటుంది. శనివారం నుంచే ఈ మార్పు అమల్లోకి వచ్చినట్లు రవాణాశాఖ కార్యదర్శి శ్రీనివాస్‌రాజు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతీయ రవాణా కార్యాలయాలు, నాగోల్, మేడ్చల్, ఇబ్రహీంపట్నం, కొండాపూర్ తదితర డ్రైవింగ్ టెస్ట్ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తూ ఓడీలపైన చెక్‌పోస్టుల్లో పని చేస్తున్న సుమారు 15 మందితో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన మరో 80 మందికి పైగా ఎంవీఐలు, ఏఎంవీఐలు,కానిస్టేబుళ్ల ఓడీలు రద్దయ్యాయి. అక్రమాలకు అడ్డాలుగా మారిన చెక్‌పోస్టులలో పోస్టింగ్ కోసం గతంలో పెద్ద ఎత్తున పోటీపడ్డారు. ఇందుకోసం అప్పట్లో పైరవీలు సైతం జోరుగా సాగాయి. చెక్‌పోస్టు కొలువుల కోసం కొందరు పెద్దమొత్తంలో ముడుపులు చెల్లించినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. పలు కార్యాలయాల్లో పని చేసే మహిళా ఎంవీఐలు కూడా చెక్‌పోస్టు కొలువుల కోసం పోటీపడడం గమనార్హం. ప్రస్తుతం ఈ ఓడీలను ప్రభుత్వం రద్దు చేయడంతో అక్రమాలకు చెక్ పెట్టినట్లయ్యింది.